నిజాంసాగర్ మండలం బ్రాహ్మణపల్లి అంజనాద్రి ఆలయాన్నిశుద్ధి చేస్తున్న భక్తులు

అంతా రామమయం

- ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ముస్తాబైన హనుమాన్, రామాలయాలు

ఉమ్మడి జిల్లాలో 'అయోధ్య' పండుగ సందడి

జగదాననంద కారకుడు.. శ్రీ రాముడి జన్మస్థలంలో అయోధ్య భవ్య మందిర కల నెరవేరిన మధుర క్షణాలు రానేవచ్చాయి. ఎన్నో వివాదాలను అధిగమించి మరెన్నో న్యాయ పోరాటాల అనంతరం రూపుదిద్దుకున్న రాములోరి ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను నేడు (సోమవారం) దేశ వ్యాప్తంగా జరుపుకొనేందుకు ప్రతి రామ భక్తుడూ ఎదురు చూస్తున్నాడు. అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాలను ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మేరకు ఊరూరా సంబురాలు నిర్వహించేందుకు హనుమాన్, రామాలయాలను ముస్తాబు చేశారు.

సుభాష్‌నగర్/కమ్మర్‌పల్లి/నందిపేట్/రెంజల్, జనవరి 21

వేల్పూర్‌లో..

సంబురాలకు ఏర్పాట్లు..
లోకాభిరాముడి ఆలయ ప్రారంభోత్సవాన్ని ఊరూరా పండుగ వాతావరణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హనుమాన్, రామాలయాల పరిసరాలను శుభ్రం చేశారు. కాషాయ జెండాలు, విద్యుద్దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. ఇంటింటా దీపాలు వెలిగించి రాములోరికి స్వాగతం పలికేందుకు భక్తులు సిద్ధమయ్యారు

ప్రత్యేక కార్యక్రమాలు..
ఉమ్మడి జిల్లాలో అయోధ్య పండుగ సందడి నెలకొన్నది. ఇప్పటికే రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో రాముడి పూజిత అక్షింతలతో ఊరూరా శోభాయాత్రలు నిర్వహించి గడపగడపకూ పంపిణీ చేశారు. భవ్య రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని రెండు రోజులుగా భక్తులు వివిధ కార్యక్రమాలు చేపట్టారు. దీక్షలు చేపట్టి మద్యం, మాంసాలను దూరం పెట్టారు. చాలా గ్రామా ల్లో ఈ మేరకు తీర్మానాలు కూడా చేశా రు. ఆలయాల్లో దీపారాధనలు, భజనలు, కీర్తనలు కొనసాగుతున్నాయి. పెద్ద ఎత్తున అన్నదానాల నిర్వహణ కు ఏర్పాట్లు చేశారు.

నీతారాముల వేషధారణలో ఉన్న చిన్నారులకు హారతిఇస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

ఆలయాల వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

వినాయక్‌నగర్, జనవరి 21: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిర్దేశిత ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్యలోని రామ మందిరంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలో 22వ తేదీ ఉదయం 6 నుంచి 23వ తేదీ ఉదయం 6 గంటలకు వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయ న్నారు. నిజామాబాద్ డివిజన్‌లోని శంభుని గుడి, గోల్‌హన్మాన్, ఖిల్లా రఘునాథ ఆలయం, ఆర్మూర్ డివిజన్‌లోని కన్యకా పరమేశ్వరీ ఆలయం, రాంనగర్ రామాలయం, బోధన్ డివిజన్‌లోని బోధన్ రామాలయం, మారుతీమందిరం, రాకాసీపేట్ హనుమాన్ దేవాలయం, ఏకచక్రేశ్వర స్వామి దేవాలయ ప్రాంతాల్లో కిలోమీటర్ మేర ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని సీపీ కోరారు.

కందకుర్తి ఆలయంలోని పాలరాతి విగ్రహాలు

తడ్‌పాకల్ రామాలయం

రాముడు నడయాడిన నేల..

గోదావరి తీరాన పూజలందుకుంటున్న రామ లింగేశ్వరుడు

గోదావరి తీరంలో వెలసిన రామాలయాలు తెలుగు రాష్ట్రాల్లో అనేకం ఉన్నాయి. ఉమ్మడి జిల్లా సరిహద్దులోని నందిపేట్ మండలం ఉమ్మెడ, కుస్తాపురం, తడ్‌పాకల్, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్, కందకుర్తి తదితర ప్రాంతాల్లో రాముడు పూజలందుకుంటున్నాడు. ఈ తీర ప్రాంతమంతా శ్రీరాముడు నడయాడిన నేలగా చరిత్రకారులు చెబుతారు. వనవాసం చేసినప్పుడు సీత కోసం అన్వేషిస్తుండగా శ్రీరాముడు కాలినడకన తెలంగాణలోని స్థలాలను సందర్శించినట్లు గుర్తించారు.

కుస్తాపురం రామలింగేశ్వరాలయం..
కుస్తాపురం వద్ద ఇసుక శ్రీరాముడు లింగాలను రూపొందించి పూజించినట్లు చెబుతారు. ఇక్కడ నిర్మించిన ఆలయానికి రామలింగేశ్వరాలయం అని పేరు. ఈ మందిరం ఎస్సారెస్పీ ప్రాజెక్టులో ముంపునకు గురైంది. దీంతో ఇక్కడి విగ్రహాలను నది ఒడ్డుకు తరలించి పోచంపాడ్‌లో కోదండ రామాలయాన్ని నిర్మించారు.

తడ్‌పాకల్ రామాలయం..
తడ్‌పాకల్ వద్ద కొంత కాలం తాటిపాకను వేసుకుని అందులో సీతమ్మవారిని తలచుకుంటూ ఉన్నాడని ఇతిహాసాల కథనం. తాటిపాక వేసుకుని ఉన్నందున ఇక్కడ ఏర్పడిన ఆవాస ప్రాంతానికి తాటిపాకల అని.. కాలక్రమేణా తడ్‌పాకల్‌గా మారిందని స్థానికులు చెబుతారు. ఇక్కడ నిర్మించిన రామాలయం శిథిలావస్థకు చేరడంతో 1990లో మందిరాన్ని పునర్నిర్మించారు.

ఉమ్మెడ ఉమా మహేశ్వరాలయం..
ఉమ్మెడలోని ఉమా మహేశ్వరాలయం, నూత్‌పల్లి పాత గ్రామంలోని రాజరాజేశ్వరాలయంలోని శివలింగాలకు శ్రీ రాముడు స్వయంగా పూజించినట్లు పూర్వీకులు చెబుతుంటారు. ఈ శివ లింగాలు ఉన్న చోట అప్పటిరాజులు ఆలయాలు నిర్మించారు.

త్రివేణీ సంగమ క్షేత్రం..
కందకుర్తి వద్దనే తెలంగాణలోకి గోదావరి ప్రవేశిస్తుంది. గోదావరి, హరిద్రా, మంజీరా నదులు కలిసే ఈ త్రివేణీ సంగమ క్షేత్రానికి శ్రీ రాముడు వచ్చినట్లు చరిత్ర. కందకుర్తి గోదావరినది తీరాన కొన్ని రోజులు ఉన్నట్లు చెబుతారు. ఇక్కడ నిర్మించిన పురాతన రామాలయంలో ఉత్తర శైలిలో చెక్కిన సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలున్నాయి. ఆది శంకరాచార్యులు సైతం కందకుర్తి గ్రామాన్ని సందర్శించినట్లు పూర్వీకులు తెలిపారు.

పోచంపాడ్ కోదండ రామాలయం

చాలా సంతోషంగా ఉన్నది..

భిక్కనూరు, జనవరి 21: అయోధ్యలో 1990లో నిర్వహించిన శిలన్యాస్‌లో పాల్గొన్న. మమ్మల్ని అడ్డుకున్నా అడవిలో నుంచి పొలాల మీదుగా అయోధ్య సరయూ నది వద్దకు చేరుకున్నాం. పోలీసులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. చాలా మంది కరసేవకులు మృతి చెందారు. కరసేవకుల రక్తం నదిలో ప్రవహించడం చూసి కన్నీళ్లు ఆగలేదు. రామ మందిర నిర్మాణ కల ఇప్పటికి నెరవేరడం చాలా సంతోషకరం.

- రవీందర్ రెడ్డి, రామేశ్వర్‌పల్లి, భిక్కనూరు మండలం

కరసేవ కోసం అయోధ్య వెళ్లా..

భిక్కనూరు, జనవరి 21: 1992లో నిర్వహించిన కరసేవ కోసం అయోధ్యకు వెళ్లాను. మా గ్రామం నుంచి ఒక్కడినే వెళ్లాను. వివాదాస్పద నిర్మాణాన్ని కూల్చిన రోజు అక్కడే ఉన్నా. పారా మిలటరీ దళాలు అడ్డుకున్నా జై శ్రీరామ్ అంటూ ముందుకు వెళ్లాం.

- రాంరెడ్డి, కరసేవకుడు, ర్యాగట్లపల్లి

విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
నవీపేట, జనవరి 21: విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేస్తున్నదని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. పైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నవీపేట మండలంలోని లింగాపూర్, నిజాంపూర్, నాళేశ్వర్, తుంగినిలో ఆదివారం పర్యటించిన ఎమ్మెల్యే.. బినోలాలో రూ.70కోట్లతో నిర్మించిన వ్యవసాయ సహకార సంఘ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అధికారులకు సూచించారు. కుటుంబాలను చిన్నాభిన్నం చేసే గంజాయి, పేకాటతోపాటు బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న బీటీ రోడ్లను కేజ్‌వీల్ ట్రాక్టర్లతో ధ్వంసం చేస్తున్నారని, అందుకు కారణమైన ట్రాక్టర్ల యజమానులతోపాటు డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిజాంపూర్ నుంచి నాళేశ్వర్ వరకు కొనసాగుతున్న డబుల్ బీటీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. ఏడాదిలోపు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నీరడి సవిత, సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, వైస్ చైర్మన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్ బిన్ హందాన్, బినోలా సర్పంచ్ పితాంబర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుగా షబ్బీర్ అలీ

కామారెడ్డి, జనవరి 21: కామారెడ్డి జిల్లాకు చెందిన మాజీ మంత్రి షబ్బీర్ అలీని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. షబ్బీర్ అలీకి కేబినెట్ హోదా కల్పిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొన్నది. కాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వ్యవహారాల సలహాదారుగా షబ్బీర్ అలీ వ్యవహరించనున్నారు. షబ్బీర్ అలీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేబినెట్‌లో రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న షబ్బీర్ అలీ మరోసారి మంత్రి పదవి ఆశించగా ఆయన్ని ప్రభుత్వ సలహాదారుగా నియమించారు.

పాస్‌పోర్టు స్కాంపై సీఐడీ సీరియస్

జిల్లా వాస్తవ్యుడి ప్రమేయంపై లోతైన విచారణ

జిల్లాలోని ఇంటర్‌నెట్ సెంటర్లపై సీఐడీ దాడులు

వినాయక్‌నగర్, జనవరి 21 : విదేశీయులకు భారత పౌరులుగా నకిలీపత్రాలతో పాస్‌పోర్టులను ఇప్పిస్తున్న ముఠాను సీఐడీ (క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్) రెండు రోజుల క్రితం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ ముఠాలో నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణానికి చెందిన సుభాష్ అనే ఏజెంట్‌ను అదుపులోకి తీసుకొని లోతుగా దర్యాప్తు చేపట్టడంతో మరిన్ని విషయాలు బయటికి వచ్చినట్లు తెలిసింది.

స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ప్రమేయం ఏమైనా ఉందా?
పాస్‌పోర్టు పొందాలంటే సంబంధిత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలను పాస్‌పోర్ట్‌కు దరఖాస్తు చేసుకునే సమయంలో జతచేయడం, పోలీసులు దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి అన్ని వివరాలు సక్రమంగా ఉంటేనే పాస్‌పోర్ట్ మంజూరుకు సిఫార్సు చేస్తారు. ఈ ప్రక్రియ అంతా ఉన్నప్పటికీ సదరు ఏజెంట్ నకిలీ ధ్రువపత్రాలతో పాస్‌పోర్టులు తీయించడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సదరు ఏజెంట్‌తో ఎస్‌బీ సిబ్బంది ఎవరైనా టచ్‌లో ఉన్నారా అనే కోణంలో సైతం ప్రత్యేక బృందాలు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

ఇంటర్‌నెట్ సెంటర్లపైనా సీఐడీ దాడులు..
ముఠా సభ్యుడు తన కార్యకలాపాలు కొనసాగించేందుకు జిల్లాలోని పలు ఇంటర్‌నెట్ సెంటర్లను వినియోగించుకున్నట్లు సీఐడీ విచారణలో తేలింది. దీంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖలీల్‌వాడి, రాజీవ్ గాంధీ ఆడిటోరియం ప్రాంతంతోపాటు భీంగల్ పట్టణంలోని మరో ఇంటర్‌నెట్ సెంటర్‌పై దాడి చేసి సీపీయూలను స్వాధీనం చేసుకున్నారు.

పాస్‌పోర్ట్‌లు ఎలా అందాయి?
ఆధార్, ఏటీఎం, పాస్‌పోర్ట్, పాన్‌కార్డులను ప్రభుత్వం దరఖాస్తుదారుని చేతికి అందజేయకుండా పోస్టు ద్వారా సంబంధిత అడ్రస్‌కు పంపుతుంది. నకిలీ పత్రాలతో తీసిన పాస్‌పోర్టును దరఖాస్తుదారుడు లేని అడ్రస్‌కు పోస్టల్‌వారు ఎలా చేరవేశారు, ఎవరి సంతకం తీసుకున్నారు, నకిలీ వ్యక్తుల చేతికి పాస్‌పోర్టులు ఎలా చేరాయి లేదా పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తు చేసిన ఏజెంటే పోస్టల్ సిబ్బందిని కలిసి పాస్‌పోర్ట్ తీసుకున్నాడా తదితర అంశాలపై విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. పాస్‌పోర్టుల స్కాంలో జిల్లాకు చెందిన వ్యక్తి ఉన్నట్లు పోలీసు అధికారులు ఇప్పటివరకు గుర్తించకుండా ఎలా విధులు నిర్వర్తించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారిక లాంఛనాలతో ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి అంత్యక్రియలు

సంతాప సూచకంగా గాల్లో కాల్పులు జరుపుతున్న ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది

మాక్లూర్, జనవరి 21: మాక్లూర్ మండలం చిక్లీ గ్రామ పంచాయతీ పరిధిలోని చిక్లీ క్యాంపునకు చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి రవిచంద్ర(33) అంత్యక్రియలు ఆదివారం అధికారిక లాంఛనాలతో నిర్వహించారు. మూడు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ జిల్లా పిడుగురాళ్ల రైల్వేస్టేషన్‌లో రైలు నుంచి దిగుతుండగా కాలు జారి కిందపడగా, తీవ్రగాయాలతో మరణించాడు. రవిచంద్ర మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకున్నది. ఆదివారం రవిచంద్ర మృతదేహంపై త్రివర్ణ పతాకాన్ని కప్పి అంత్యక్రియలకు తరలించారు. శ్మశాన వాటికలో రవిచంద్ర మృతదేహం వద్ద జవాన్లు గౌరవ వందనం చేసి, గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపి ఘన నివాళులర్పించారు. ఎయిర్‌ఫోర్స్ అధికారి చవాన్ పాల్గొని రవిచంద్ర భార్య, కూతుళ్లు, తల్లిదండ్రులను ఓదార్చారు. రవిచంద్ర అంత్యక్రియలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు తెలిపారు.

తెలంగాణ భవన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఎన్నారై గ్లోబల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల మర్యాదపూర్వకంగా కలిశారు.



నేటి నుంచి బడాపహాడ్ ఉర్సు

వర్ని, జనవరి 21: మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న బడాపహాడ్ దర్గా వద్ద సోమవారం నుంచి ఉర్సు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో సోమవారం గంధాలు తీసుకొని బయల్దేరుతారని తహసీల్దార్ నారాయణ తెలిపారు. బుధవారం చిరాగ్, ఖవ్వాలి, గురువారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

పంచాయతీ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే

మాక్లూర్, జనవరి 21: మండలంలోని రామచంద్రాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. రూ.25లక్షల నిధులతో భవనం నిర్మించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఈజీఎస్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, ఎంపీడీవో జైక్రాంతి, సర్పంచ్ కట్కం వెంకన్న, ఎంపీటీసీ పెద్దులు తదితరులు పాల్గొన్నారు.